# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 22 నవంబర్ 2024 SANGAREDDY


## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



మసాన్‌పల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న హరీశ్‌రావు, క్రాంతికిరణ్, భిక్షపతి తదితరులు

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- మాసాన్‌పల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరు

అందోల్, నవంబర్ 21: పెద్దమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అమ్మవారిని మొక్కుకున్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మాసాన్‌పల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ ఉత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చెరువులను ఆధునీకరించడంతో మత్స్యకారులకు ఉపాధి మెరుపడిందన్నారు. కేసీఆర్ ముందుచూపుతో చెరువులు పూర్వవైభవం సంతరించుకున్నాయని, మత్స్య సంపద పెరిగి మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో కాళేశ్వరం నీటితో ఈ ప్రాంతం మరింత సస్యశ్యామలం అయ్యేలా పెద్దమ్మ తల్లి చల్లని దీవెనలు ఉండాలని మొక్కుకున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బండ ప్రకాష్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు నారాయణ, నాగభూషణం, నాయకులు ఉదయ్‌భాస్కర్, ఆదర్శ్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమానికి హాజరైన ప్రజలు

## చేపల పెంపకంతో ఉపాధి పొందాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, నవంబర్ 21: చేపల పెంపకంతో మత్స్యకారులు ఉపాధి పొందాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హత్నూర పెద్ద చెరువులో 42 వేలు, సికిందలాపూర్ చెరువులో 50 వేలు చేప పిల్లలను ఆమె వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో మత్స్యకారులకు 100 శాతం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అందులో 50 శాతం మాత్రమే చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నదని ఆరోపించారు. మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జిల్లాలో 79 పెద్ద చెరువుల్లో 50 శాతమే చేప పిల్లలను వదులుతున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి నరసింహారావు తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా బొచ్చ, రవుటా, మిరిగాల రకాల చేపపిల్లలను పంపిణీ చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీశైలం, నాయకులు ఆగమయ్య, నరేందర్, భిక్షపతి, వీరేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



గోమారం చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

### చేపపిల్లల సంఖ్య తగ్గింది

శివ్వంపేట, నవంబర్ 21: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పంపిణీ చేసిన చేప పిల్లలకంటే కాంగ్రెస్ హయాంలో తక్కువ సంఖ్యలో పంపిణీ చేసినట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం చెరువులో ఎమ్మెల్యే చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపపిల్లలు తక్కువగా వస్తున్నాయని, గతంలో గోమారం చెరువులో లక్షా 80వేలు వస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 50వేల చేపపిల్లలు మాత్రమే పంపడం విడ్డూరమన్నారు. మత్స్య సంపదతో మత్స్యకారులను ఆదుకునేలా ఉండాలి కానీ కుదించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు నెలలు ఆలస్యంగా పంపిణీ చేయడంతో మత్స్యకారులను ఇబ్బంది పెట్టినట్టేనన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్, మాజీ సర్పంచ్ లావణ్య మాధవరెడ్డి, మత్స్య పరిశ్రమ సహకార సంఘం గోమారం సొసైటీ చైర్మన్ కుంట లక్ష్మణ్ పాల్గొన్నారు.



హత్నూర పెద్ద చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## పింఛన్ పెంచి హామీ నిలబెట్టుకోవాలి

హుస్నాబాద్, నవంబర్ 21: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలేదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛన్‌ను రెట్టింపు చేయడంతో పాటు అన్ని విధాలుగా ఆదుకుంటామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేర్చడం లేదన్నారు. అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, సబ్సిడీ కింద వాహనాలు అందజేయాలని, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు దీక్ష చేస్తామని హెచ్చరించారు. వీరికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ సహా పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఆందోళనలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు గుగులోతు రాజేశ్వరి, పెండెల సమ్మయ్య, చిరబోయిన రమేశ్, కనగండ్ల వెంకటలక్ష్మి, యాటపోలు వసంత, శనిగరం అపర్ణ, దివ్యాంగులు పాల్గొన్నారు.



రిలేదీక్షలో కూర్చున్న దివ్యాంగులు

# కల్యాణలక్ష్మిపై దళారీ గద్దలు

## ఒక్కో చెక్కుకు రూ.10 నుంచి రూ 15 వేల వరకు వసూలు

- కాంగ్రెస్ వచ్చిన తర్వాత దళారుల డిమాండ్
- తహసీల్ కార్యాలయం నుంచి జాబితా తీసుకొని ఫోన్‌కాల్స్
- దళారులకు తహసీల్ కార్యాలయ సిబ్బంది అండదండలు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు.. పట్టించుకొని జిల్లా అధికారులు

సిద్దిపేట, నవంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో దళారులు రాజ్యమేలుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చేయి తడిపితేనే పనులు అవుతున్నాయి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారుల నుంచి దళారులు ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కో చెక్కుకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూలు చేస్తున్నారు. పేదింటి అడపిల్ల పెండ్లికి ఇబ్బంది కావద్దని బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారు. ఆడబిడ్డ పెండ్లికి ఈ పథకాల కింద ఆర్థికసాయం చెక్కులు అందించి కేసీఆర్ పెద్దన్నలాగ నిలిచారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు కడుపునిండా భోజనం పెట్టి లబ్ధిదారులకు చెక్కులను అందించేవారు. పండుగలా చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించేవారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు పైసా ఖర్చు లేకుండా చెక్కులు రావడంతో లబ్ధిదారులు సంతోషించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అందుకు విరుద్ధంగా పరిస్థితి తయారైంది. ఏ చెక్కు కావాలన్నా డబ్బులు ముట్టజెప్పాల్సి వస్తున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దళారుల బెడద ఎక్కువైంది. కార్యాలయాల్లో దళారుల రాజ్యం నడుస్తోంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులకు చేతికి అందాలంటే ఆ పేద కుటుంబాలు డబ్బులు ముట్టచెప్పాల్సి వస్తున్నది. ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దర్జాగా దళారులు సమాధానం ఇస్తున్నారు. మీరు ఇచ్చే డబ్బుల్లో అధికారులకు వాటాలు పోతాయి అని చెబుతున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఫోన్‌చేసి మరీ డిమాండ్...

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు దళారులు బెడద తప్పడం లేదు. దళారులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఒక్కో లబ్ధిదారు వద్ద రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల దరఖాస్తుల జాబితాను స్థానిక తహసీల్ కార్యాలయ సిబ్బంది సహకారంతో దళారులు తీసుకొని లబ్ధిదారులకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే మీ ఫైల్ ముందుకు కదులుతుందని, లేకపోతే ఇక్కడే తహసీల్ కార్యాలయంలో ఆగిపోతుందని బెదిరిస్తున్నారు. డబ్బులు ఇచ్చిన తర్వాత ఎవరికీ చెప్పవద్దని, అలా చెబితే మీ చెక్కు రాకుండా చేస్తామంటూ దళారులు దరఖాస్తుదారులను బెదిరిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో దళారుల బెడద మరి ఎక్కువైంది. చెక్కు రాకముందు, చెక్కు వచ్చిన తర్వాత దళారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో దళారుల బెడద ఎక్కువైందని ప్రజలు వాపోతున్నారు. కల్యాణలక్ష్మి చెక్‌కు డబ్బులు తీసుకుంటున్నారని, ఇదేనా మీ పాలన అంటూ స్థానిక ఎమ్మెల్యేకు ఓ లబ్ధిదారుడు మెసేజ్ చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కొద్దిసేపటికే ఆ మెసేజ్‌ను డిలీట్ చేశారు. ఇలా ఏ గ్రామంలో చూసినా దళారుల బెడద ఎక్కువైంది. ఇదే మండలంలో ఓ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు ఇదే పరిస్థితి ఎదురైంది. దీంతో ఆ కార్యకర్త ఆవేశంతో ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నాడు. 'అన్నా.. మన పార్టీ ప్రభుత్వంలో ఉంది. నేను సీనియర్ కార్యకర్తను' నావద్ద కూడా దళారులు డబ్బులు తీసుకునుడు ఏంది అన్నా'.. అంటూ మెసేజ్ పెట్టినట్లు సమాచారం.




### భారీగా డబ్బుల వసూళ్లు..

ఇటీవల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి దళారులు అందినకాడికి డబ్బులు వసూలు చేస్తున్నారు.సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వసూలు రాజాలు పెరిగిపోయారు. ప్రతి పనికి ఏదో ఒక రకంగా డబ్బులు గుంజుడే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తును స్థానిక తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారుడు అప్పజెప్పాల్సి ఉంటుంది. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ స్థానిక తహసీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహసీల్దార్ దానిని పరిశీలించి ఆర్డీవోకు పంపుతారు. ఇలా ప్రాసెస్ పూర్తి అయ్యాక లబ్ధిదారుడికి పథకం మంజూరవుతుంది.కానీ, ఇక్కడే అసలు మోసం జరుగుతున్నది. అయా మండల కేంద్రాల్లోని తహసీల్ కార్యాలయ సిబ్బందితో కొంత మంది దళారులు కుమ్మకవుతున్నారు. తహసీల్ సిబ్బంది అండదండలతో కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుల జాబితాను దళారులు తీసుకుంటున్నారు. ఆ జాబితా పట్టుకొని లబ్ధిదారులకు ఫోన్లు చేసి మీరు కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు కదా..? చెక్కు మంజూరు కావాలంటే రూ. 10వేల నుంచి రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమ వద్ద అంత డబ్బులు లేవని..ఇంక తమకు పథకం మంజూరు కాలేదని... ఇప్పుడే డబ్బు లు అడిగితే ఎలా అంటూ దరఖాస్తుదారులు ప్రశ్నిస్తే..? మీకు పథకం మంజూరు కోసమే రూ. 10 వేలు ఇవ్వమంటున్నాం...ఇప్పుడు డబ్బులు ఇస్తేనే మీ ఫైల్ ముందుకు పంపుతాము. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే పనులు అవుతాయి.. అంటూ బెదరిస్తున్నారు. చేసేది ఏమిలేక లబ్ధిదారులు డబ్బులు ముట్ట జెబుతున్నారు. మంజూరు అయ్యాక చెక్ ఇచ్చే ముందు కూడా ఎంతో కొంత డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పనికి పైసా లేనిదే పనులు కావడం లేదని లబ్ధిదారులు మొత్తుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### ఇందిరమ్మ ఇండ్లకు అప్పుడే బేరాలు...



ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా వీటిని మంజూరు చేస్తామని చెప్పింది. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాక ముందే దళారులు గ్రామాల్లో బేరాలు కుదుర్చుకుంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రొసీడింగ్‌లు తీసుకొని ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకున్న లబ్ధిదారుల ఇండ్లను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీరాగానే రద్దు చేసింది. దీంతో లబ్ధిదారులు లబోదిబోమన్నారు. ఇల్లు మంజూరు కోసం దళారులను ఆశ్రయించి ఎంతో కొంత సమర్పించుకుంటున్నారు. ఇలా ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అధికార పార్టీ నేతలు, దళారులపై ఆరోపణలు వస్తున్నాయి.

## నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

- ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, కలెక్టర్ వల్లూరి క్రాంతి

కంది, నవంబర్ 21: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు మరువలేనివని, నిబద్ధత, నిజాయితో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, కలెక్టర్ క్రాంతి వల్లూరు శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకొని కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. కంది మండలం చిద్రుప్ప పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఐదు జిల్లాలకు చెందిన 224 మంది ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్‌కు గురువారం పాసింగ్ ఔట్, దీక్షాంత్ పరేడ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, కలెక్టర్ క్రాంతి వల్లూరి, ఎస్పీ చెన్నూరి రూపేశ్ హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలన్నారు. వంద శాతం ఫలితాలకు కృషి చేసిన డీటీసీ ప్రిన్సిపాల్, టీచింగ్ స్టాప్‌ను అభినందిచారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి డీఐజీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ్‌రావు, డీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, డీఎస్పీలు, సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుళ్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

## చలిగిలి..

చలి తీవ్రత పెరగడంతో జనం వణికిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో నమోదవుతున్నాయి. చలి నుంచి రక్షణకు ప్రజలు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. ఉదయం, రాత్రి చలిమంట కాచుకుని ఉపశమనం పొందుతున్నారు. ఉదయం 8గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. దీంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు నడుపుతున్నారు.
–సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, నవంబర్ 21







# పత్తి రైతు పరేషాన్

- అధిక వర్షాలకు పత్తికి ఆశించిన తెగుళ్లు
- తగ్గిన దిగుబడి.. మద్దతు ధర కరువు
- వేధిస్తున్న కూలీల కొరత.. పత్తి తెంపేందుకు ఇక్కట్లు
- సకాలంలో ప్రారంభం కాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు



సంగారెడ్డి జిల్లా రుక్మాపూర్ శివారులో పత్తి తెంపుతున్న కూలీలు

జహీరాబాద్, నవంబర్ 21: వానకాలం పత్తి పండించిన రైతులు పరేషాన్‌లో ఉన్నారు. ఈసారి అధిక వర్షాలకు పత్తి పంట బాగా దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతం పత్తి పంట చేతికి రాగా, రైతులకు కూలీల కొరత వేధిస్తున్నది. కూలీలు దొరక్క కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలను నుంచి రప్పించుకుంటున్నారు. దీంతో పత్తి ఏరేందుకు కూలీలకు అధికంగా డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. మెదక్, సిద్దిపేట జిల్లాలతో పోలిస్తే సంగారెడ్డి జిల్లాలో రైతులు పత్తి ఎక్కువగా సాగుచేస్తారు. ఈసారి వానకాలంలో సంగారెడ్డి జిల్లాలో 1.04 లక్షల ఎకరాలు, మెదక్ జిల్లాలో 36 వేల ఎకరాల్లో పత్తి పండించారు. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్ ప్రాంతంలో ఎక్కువగా పత్తి పండిస్తారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో 62, 787 ఎకరాలల్లో పత్తి సాగు చేశారు.ఆగస్టు నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు పత్తి పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. వానకు పత్తిలో తెగుళ్లు, చీడపురుగుల ఉధృతి అధికమైంది. కలుపు తీసే పరిస్థితి లేకుండా పోవడంతో చేను బలంగా పెరగలేదు. గూడా రాలిపోవడంతో చెట్టుకు 50 నుంచి 60 కాయలు కాయాల్సి ఉండగా, 20 నుంచి 30 వరకు కాశాయి. ఈసారి లగోడి కూడా వచ్చే పరిస్థితి లేదని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో కూలికి అధికంగా చెల్లించాల్సి వస్తున్నది. ఒక్కో కూలీకి సుమారు రూ. 500 నుంచి 800 వరకు చెల్లిస్తున్నామని రైతులు చెబుతున్నారు. జీపులు, ఆటోవాలాలకు కూలీలను తీసుకువచ్చేందుకు రోజుకు రూ. 800 నుంచి 1,200 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు, చీడపీడలను ఎదుర్కొని పత్తి పండించిన రైతులకు మద్దతు ధర లభించడం లేదు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వ మద్దతు ధర రూ. 7,521 ఉండగా, వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ. 6,800 లకు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు తేమ శాతం పేరుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. ఇంత జరుగుతుంటే వ్యవసాయాధికారులు, సీసీఐ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు తొలిగించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 10 వేలకు కొనుగోలు చేస్తే లాభం రాకున్నా నష్టాల నుంచి బయటపడుతామని రైతులు పేర్కొంటున్నారు.

### పెట్టుబడులు ఎల్లేలా లేవు..

పత్తి తెంపేందుకు కూలీలు కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. పత్తి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్నం. కానీ, అధిక వర్షాలకు పంటకు తెగుళ్లు సోకి దిగుబడులు తగ్గాయి. పత్తిని తెంపేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తెప్పించుకుంటున్నాం. కూలి బాగా చెల్లించాల్సి వస్తున్నది. వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటలను సాగు చేస్తే పెట్టుబడులు చేతికి వచ్చే పరిస్థితి లేదు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకే పత్తిని వ్యాపారులకు అమ్ముకుంటున్నాం.



– డప్పూర్ సంగారెడ్డి,
రైతు, హద్నూర్ (న్యాల్‌కల్ మండలం)

## 'నమస్తే కథనం'తో కాంగ్రెస్‌లో అలజడి

### పటాన్‌చెరులో కాంగ్రెస్ పరిస్థితిపై అధిష్టానం ఆరా

- బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్‌ను కలిసిన కాటా శ్రీనివాస్‌గౌడ్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై ఫిర్యాదు
- తనకు న్యాయం చేయాలని వినతి
- గాంధీభవన్ ఎదుట కాటా మద్దతుదారుల ఆందోళన
- పటాన్‌చెరులో కాంగ్రెస్ పరిస్థితి చక్కదిద్దడంపై అధిష్టానం దృష్టి

సంగారెడ్డి, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): 'తలోదారి' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం కాంగ్రెస్ పార్టీలో అలజడి సృష్టించింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్‌గౌడ్, నీలం మధు మధ్య నెలకొన్న వర్గపోరుపై కథనం ప్రచురితం కావడం పటాన్‌చెరు, సంగారెడ్డి కాంగ్రెస్ నాయకుల్లో చర్చనీయాంశమైంది. ఈ కథనాన్ని కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా వేదిక ద్వారా షేర్ చేసుకోవడం, ముగ్గురు నేతల మద్దతుదారులు సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ పెట్టుకున్నారు. కొంతమంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు నమస్తే కథనాన్ని కాంగ్రెస్ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పటాన్‌చెరులో పార్టీ పరిస్థితిని వివరిస్తూ మరింత నష్టం జరగకుండా చూడాలని కోరినట్లు తెలుస్తుంది.'నమస్తే తెలంగాణ' కథనం కాటా శ్రీనివాస్‌గౌడ్ మద్దతుదారుల్లో కదలికకు దారితీసింది. సొంతపార్టీలోనే ప్రాధాన్యం లేకుండా ఎన్నిరోజులు ఇలా ఉండాలి, అధిష్టానంతో తాడోపేడో తేల్చుకుందాం అంటూ కాటా అనుచరులు గురువారం ఉదయం ఆయన వద్ద పట్టుబట్టారు. దీంతో కాటా శ్రీనివాస్‌గౌడ్ 200 మంది మద్దతుదారులతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు చేరుకున్నారు. అక్కడ కాటా శ్రీనివాస్‌గౌడ్ మద్దతుదారులతో అధిష్టానం తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. పటాన్‌చెరులో అసలైన కాంగ్రెస్ పార్టీని, కార్యకర్తలను కాపాడాలని, కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు న్యాయం చేయాలంటూ ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.


తలోదారి..!
కాంగ్రెస్ అధిష్టానానికి మింగుడుపడని పటాన్‌చెరు పాలిటిక్స్
అధిష్టానంపై ఎమ్మెల్యే కినుకు

గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం

### బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్‌ను కలిసిన కాటా..

కొంతకాలంగా కాంగ్రెస్ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్ గురువారం పటాన్‌చెరు కాంగ్రెస్ నాయకులు, తన అనుచరులతో కలిసి గాంధీభవన్ వెళ్లారు. గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను ఆయన కలిశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అటు పార్టీ, ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పదేండ్లుగా పటాన్‌చెరులో బీఆర్‌ఎస్‌పై తాను పోరాటం చేశానని, ఇప్పుడు తనను కాదని బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన మహిపాల్‌రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేసిన తనను విస్మరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనకు అనుకూలమైన అధికారులను రాత్రికి రాత్రి పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారని, తన అనుకూలమైన వారికి ప్రయోజనాలు చేకూరుస్తున్నారని కాటా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ తమను మాత్రం ఆహ్వానించడం లేదని ఫిర్యాదు చేశారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ బతకాలంటే తనకు న్యాయం చేయాలని బట్టి విక్రమార్కను, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కాటా శ్రీనివాస్ కోరారు. దీనిపై బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ స్పందిస్తూ త్వరలోనే పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి చక్కదిద్దడంతో పాటు కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. అధిష్టానం హామీతో కాటా శ్రీ నివాస్‌గౌడ్ సంతృప్తి చెందినట్లు తెలుస్తుంది. పీసీసీ ఛీఫ్ మహేశ్‌గౌడ్ సైతం త్వరలోనే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాటా శ్రీనివాస్‌గౌడ్, నీలం మధును పిలిపించుకుని పరిస్థితిని చక్కదిద్దాలని యోచిస్తున్నట్లు సమాచారం. గాంధీభవన్‌కు వెళ్లిన వారిలో పటాన్‌చెరు కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, శశిధర్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, మహేశ్‌గౌడ్, రాజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింగ్‌రావు, వడ్డే కృష్ణ, సుధాకర్‌యాదవ్, మన్నె రవీందర్ తదితరులు ఉన్నారు.